ప్రజాజ్యోతి
నిజామాబాద్ కామారెడ్డి
సోమవారం। 11 ఆగస్టు। 2025 । పేజీలు 4

### ఒంటరితనం భరించలేక..

# వృద్ధురాలి ఆత్మహత్య

సిరికొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) సిరికొండ మండలం చీమన్ పల్లి గ్రామానికి చెందిన శ్రీమతి చందాల లక్ష్మి 63 సం" ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సిరికొండ ఎస్సై జె రామకృష్ణ అందించిన వివరాల ప్రకారం చీమన్ పల్లి గ్రామానికి చెందిన చందాల లక్ష్మి గత కొన్ని రోజులుగా మానసికంగా కుంగి స్థిరంగా లేకపోవడం అందులో ఒంటరిగా నివసించడం వల్ల తీవ్ర మనోవేదనకు లోనై తన నివాసంలో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. ఆమె కుమారుడు సందాల భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.



# సాంస్కృతిక వైభవానికి తీజ్ నిదర్శనం



ఎల్లారెడ్డి ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) గిరిజనుల సాంస్కృతిక పండగ తీజ్ పండగ అని స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట శాఖల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హాజరయ్యారు. గిరిజనులందరికి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ మాట్లాడుతూ బంజారాలు భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకుంటారని అన్నారు. పెళ్లి కానీ యువతులు రోజు మనం చిన్న బుడ్డిలో నానబెట్టి మొలకలు వచ్చిన నిమిత్తం తొమ్మిది రోజులు పాటు తాను కోరుకున్న కోరికను చూడాలని కులదైవానికి కృతజ్ఞతలు నిర్వహిస్తారు అన్నారు. తొమ్మిది రోజులుగా పవిత్రంగా పూజలు నిర్వహించి శ్రావణ మాసంలో గిరిజన మహిళలు అంతా కలిసి ఘనంగా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ. గిరిజనుల సాంస్కృతి వైభవానికి తీసుకొని నిలుస్తుందని అన్నారు. ఎమ్మెల్యే గిరిజనతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ముత్యాపు ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగి. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురేందర్, ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట మండలాల అధ్యక్షులు రాములు నాయక్, రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సర్దార్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్లు పద్మ శ్రీకాంత్, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వినోద్ గౌడ్, మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సంతోష్ నాయక్, బంజారా యూత్ అధ్యక్షులు గణేష్ నాయక్, గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.









# క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

సిరికొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) నిజామాబాద్ జిల్లా రూరల్ సిరికొండ మండలం కేంద్రంలో క్రీడలు నిర్వహించడానికి క్రీడా ప్రాంగణం లేదు. యువకులు ఆడుకోవడానికి అంగడి బజారును ఆటలకు వినియోగిస్తున్నారు అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని సిరికొండ యువత విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రానికి ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు. సీఎం కప్ క్రీడలు, మండల స్థాయి క్రీడా పోటీలు ఆడడానికి ఆటస్థలం లేక ప్రైవేట్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని సిరికొండ మండల కేంద్రానికి క్రీడల ప్రాంగణం ఏర్పాటు చేసేలా కృషి చేయాలని యువకులు కోరుకుంటున్నారు. క్రీడల వల్ల యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పై ఆసక్తి పెంచుకొని శారీర మానసికంగా కృంగిపోకుండా ఇతర ఆలోచనలు రాకుండా చెడు అలవాట్లకు పోకుండా క్రీడలు దోహదం చేస్తాయి. సిరికొండ మండల కేంద్రంలో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్రీడా ప్రాంగణం కు స్థలం చూపించి బోర్డు పెట్టాలని ఆదేశించిన ఆటలు ఆడడానికి స్థలం లేక వచ్చిన క్రీడల కిట్లు కూడా సిరికొండకు ఇవ్వలేదు. యువత కొట్లాడి 2 కిట్లు తీసుకోవడం జరిగింది. ఆటలు ఆడుకోవడానికి స్థలం ఉంటే మండల హెడ్ క్వార్టర్ లో యువతను ప్రోత్సహించి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నంత స్థానాలలో ఉండేందుకు క్రీడలు దోహదపడతాయి అని అందరికీ తెలుసు కానీ అధికారుల నిర్లక్ష్యము వల్ల యువతకు క్రీడా ప్రాంగణం లేక చెడు అలవాట్లకు దారి తీసే అవకాశం ఉంది ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని సిరికొండ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కుల సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్న గాండ్ల సంఘం




ఇందూర్ నగరం: సిర్నాపల్లి గడి గాండ్ల పట్టణ సంఘం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతు ఇందూర్ పట్టణ గాండ్ల సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేవిదంగా ఐక్యమత్యంతో అంచలంచెలుగా ఎదుగుతుందని అభినందించారు. సంఘాల ద్వారా సామాజిక సమైక్యత పెంపొందుతుందని,గాండ్ల సంఘం తన సేవా కార్యక్రమాల ద్వారా మంచి మార్గదర్శిగా నిలవాలని ఆశిస్తున్నామన్నారు. గాండ్ల సంఘం అభివృద్ధికి మరియు నూతన కమిటీకి నా పూర్తి మద్దతు ఉంటుంది" అని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గాన్ని తన చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నాగరాజు గారు, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి గారు, కాంగ్రెస్ నాయకులు, నరాల రత్నాకర్ గారు, రాంభూపాల్ గారు, గాండ్ల సంఘం కార్యవర్గం ఉపాధ్యక్షులు ఆసోల్ల రాజేంద్ర,మరియు గోపి, సెక్రటరీ కాసర్ల మోహన్, జాయింట్ సెక్రెటరీ సాయన్న, క్యాషియర్ హనుమండ్లు, గాండ్ల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## హజరత్ పీర్ సమాద్దీన్ ఉరుసు వేడుకలు

ప్రజా జ్యోతి బీర్కూర్ ఆగస్టు 10. ఆదివారం రోజున బీర్కూరు మండలంలో గల హజరత్ పీర్ సమాద్దీన్ సాయబు ఉరుసు సందర్భంగా బీర్కూర్ లో గంప జత్ర నిర్వహించడం జరిగింది, హజరత్ చాదర్ ను గుర్రం మీద ఊరేగింపు జరిగింది, ఈ కార్యక్రమంలో ఊరు మొత్తం కలిసి వేడుకలు జరిపించుకోవడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాలరాజు, రాజకీయ నాయకులు ఊరు పెద్దలు ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది. అంతేకాకుండా ఇతర గ్రామాల నుంచి కూడా ప్రజలు పాల్గొనడం జరిగింది.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



భిక్కనూరు ఆగస్టు10 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో మరియు ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్వాడీలలో ఇచ్చే ఆల్బెండజోల్ టాబ్లెట్లను నమిలి మింగడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ యమీమా సూచించారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## అర కొరా వసతులతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు



భిక్కనూరు ఆగస్టు 10( ప్రజా జ్యోతి) మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయంలో గత నెలలో జులై 22 లాటరీ పద్దతి ద్వారా లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్(50) ఇళ్ళను ప్రకటించడం జరిగింది.అయితే ఈ ఇల్లు గత ప్రభుత్వం నిర్మించినవి కాగా ఇన్ని సంవత్సరాలు నిరుపయోగంగా ఉండడం వల్ల, ఇళ్లలో కరెంటు, నీటి వసతి లేకపోవడంతో, డ్రైనేజీ పైపులైన్లు పూర్తిగా పగిలిపోయాయి .చుట్టుపక్కల పరిసరాలు కూడా చెట్లు చెదారంతో చాలా ఇబ్బందికరంగా ఉందని ,ఇప్పుడు కురుస్తున్న వర్షాలకి డ్రైనేజీ వ్యవస్థ ఇబ్బందికరంగా ఉండడంతో దోమల వ్యాప్తి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిర్వాసితులు భయపడుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం తమను పట్టించుకోని సమస్యలను పరిష్కరించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద రిక్వెస్ట్ స్టాప్ దగ్గర బస్సులు ఆగే విధంగా చూడాలని వారు కోరారు.

## రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



భిక్కనూరు ఆగస్టు 10(ప్రజా జ్యోతి) మండల కేంద్రంలోని కొత్తగా పట్టా పాసు బుక్కులు పొందిన రైతులు రైతు భీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, భిక్కనూరు ఏఈఓ వినోద్ కుమార్ తెలిపారు. .జూన్ 5వ తేదీ వరకు కొత్త పాస్ బుక్కులు పొందిన వారు ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, దీని గురించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవడానికి మండల కేంద్రంలోని రైతు వేదిక ను సంప్రదించాలని ఆయన తెలిపారు.




## రక్షాబంధన్ పేరుతో ఆర్టీసీ అదనపు చార్జీల మోత

భిక్కనూరు ఆగస్టు10 (ప్రజా జ్యోతి) రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ బస్సులలో గత గురువారం సాయంత్రం నుండి అదనపు చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశారు.ఉదయం 50 రూపాయలు ఉన్న బస్సు టికెట్ సాయంత్రం 90 రూపాయలుగా వసూలు చేశారు.ఏమిటని ప్రయాణికులు కండక్టర్ ని ప్రశ్నించగా మాకు ఏమీ తెలియదని సోమవారం వరకు ఇవే చార్జీలు కొనసాగుతాయని ఏవైనా ప్రశ్నలు ఉంటే డిపో మేనేజర్ ని సంప్రదించాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగింది. మంగళవారం నుంచి చార్జీలు యధావిధిగా ఉంటాయని అని తెలిపారు.ఎటువంటి అధికారిక ప్రకటన లేకుండా ప్రజల నుండి పండగ స్పెషల్ బస్సులు అంటూ అధిక చార్జీలను వసూలు చేయడం పేద ,మధ్యతరగతి ప్రయాణికుల పైన పెనుభారమైంది.జేబీఎస్ నుండి నిజాంబాద్ రావడానికి ఒక్కరికి 450 రూపాయల చొప్పున వసూలు చేయడం జరిగింది.మామూలు సమయంలో 210 రూపాయలు ఉన్న బస్సు చార్జీ రాఖీ పౌర్ణమి సందర్భంగా డబుల్ కావడంతో ప్రయాణికులు బిత్తర చూపులు చూశారు .ఈ విషయమై ప్రయాణికుడు బిజెపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏక్ నాథ్ మాట్లాడుతూ...వేరే అన్యమత పండగల టైంలో పెరగని చార్జీలు కేవలం హిందూ మతస్తుల పండగల టైంలోనే పెరగడానికి కారణాలు చెప్పాలని అడిగాడు. దీనికన్నా ఆటోలు బెటర్ అని 54 మంది కెపాసిటీ ఉన్న ఆర్టీసీ బస్సులో 120 మంది ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని ఫ్రీ బస్సు పేరుతో ప్రజలను మోసం చేయడమే కాకుండా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్టుగా ఉందని ఇది మత వివక్ష కాదా? అని ఆయన ప్రశ్నించారు.ఈ విషయమై ప్రతి ఒక్క హిందువు జాగృతమై ఆలోచించాల్సిన అంశమని ప్రజా జ్యోతి పత్రిక ద్వారా ప్రశ్నించాడు..

## పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

నాగిరెడ్డిపేట్,ఆగష్టు10(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్ పేట్ గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు.ఎస్సై వివరాల ప్రకారం.... ఆదివారం నమ్మదగిన సమాచారం మేరకు గోపాల్ పేట్ గ్రామ శివారులో ఆకస్మిక తనిఖీలు చేయగా రహస్యంగా నలుగురు వ్యక్తులు పేకాడుతుంగా పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని వారి వద్ద నుంచి 1610 రూపాయల నగదును, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.




## రైతు బీమా కు దరఖాస్తుల ఆహ్వానం

**మండల వ్యవసాయ అధికారి పద్మ**

మాక్లూర్ ఆగస్ట్ 10 (ప్రజా జ్యోతి ) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకానికి ఈనెల 13వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మ అన్నారు. జూన్5 వరకు పట్టాపాసు బుక్ వచ్చినా, అంతకు ముందు బీమా చేసుకోని రైతులు చేసుకోవాలని తెలిపారు. కొత్త రైతులు దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారుపాసు బుక్‌జిరాక్స్ కానీ ఎమ్మార్వోతో డిజిటల్‌సంతకం అయిన డివన్‌పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.14 ఆగష్టు 1966 నుంచి 14 ఆగష్టు 2007 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే బీమాకు అర్హులు. ఆధార్‌కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఎంపీ నిధులతో హుస్సేన్ నగర్‌లో హైమాస్ట్ లైటు ఏర్పాటు

సిరికొండ ఆగస్టు 10( ప్రజా జ్యోతి) సిరికొండ మండలం హుస్సేన్ నగర్ గ్రామంలో ఎంపీ అరవిందు నిధులతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందని బిజెపి మండల అధ్యక్షుడు గుర్రాల సంజీవ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీ అరవింద్ నిధులతో హైమాస్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంపీ అరవింద్ కు నిజామాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు దినేష్ కులచారికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు గుర్రాల సంజీవరెడ్డి, మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు గడ్డ గంగా దాస్, దయ్యాల నాగేష్ గడ్డ నాగేష్ భూమేష్ చరణ్ అజయ్ సృజన్ విశాల్ తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు పనులు పూర్తి చేయడంలో విఫలం

గాంధారి ఆగష్టు 10(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని నర్సపూర్ గ్రామంలో రోడ్డు పనులు పూర్తి చేయడంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు విఫలమయ్యారని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకోలేదని, 18 నెలలుగా గ్రామాన్ని సందర్శించలేదని ఆయన మండిపడ్డారు. గతంలో రూ. 4.5 కోట్లతో రోడ్డు పనులు మంజూరయ్యాయని ఐదుగురు నాయకులు చెప్పి మోసం చేశారని, ఎమ్మెల్యే ఫొటోకు బలవంతంగా పాలాభిషేకం చేయించారని మధుసూదన్ రావు ఆరోపించారు. రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీటిని బీజేపీ కార్యకర్తలు తొలగించారని తెలిపారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హై మాస్ట్ లైట్ల ప్రారంభం, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



గాంధారి ఆగష్టు 10(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదివారం కొత్తగా ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణం జరుగుతున్న జానీ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా, జానీ కుటుంబ సభ్యులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ గారికి మరియు సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, నియోజకవర్గం మొత్తం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బిల్లులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పనుల పురోగతిపై గ్రామ పంచాయతీ సెక్రటరీలతో సమావేశాలు నిర్వహించి నివేదికలు తీసుకుంటున్నానని చెప్పారు. ఈ ఇళ్ల నిర్మాణాలతో పేద ప్రజల సొంత ఇంటి కల నిజమవుతుందని, మరిన్ని ఇళ్లు మంజూరు కావడానికి ప్రభుత్వంతో చర్చిస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గాంధారి ఏఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, గాంధారి పట్టణ అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గండివేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ రేణుక చౌహన్ సూచనలు



గాంధారి ఆగష్టు 10(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రేణుక చౌహన్ తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వ్యవసాయ బావులు, పొలాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లలో ఉండవద్దని, ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆమె కోరారు. ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

## మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

రాజంపేట ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) రాజంపేట మండలంలోని బసన్నపల్లి గ్రామానికి చెందిన రైతు ఏనుగు రాజిరెడ్డి పొలంలో అడవి పందులు బీభత్సం సృష్టించాయి. రెండు ఎకరాల విస్తీర్ణంలో కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను గుంపులుగా వచ్చిన పందులు పూర్తిగా ధ్వంసం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందుల దాడి నుంచి రక్షణ కల్పించాలని ఎన్నిసార్లు అటవీశాఖ అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని రైతులు వాపోతున్నారు. పంట నష్టంతో పాటు ఆర్థికంగా కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే పంట రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పందులను తరిమికొట్టడానికి వివిధ మార్గాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ముందడుగు వేయాలని, నష్టపోయిన మొక్కజొన్న పంటకు నష్టపరిహారం మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.







## నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం డాక్టర్ సురేష్

రామారెడ్డి ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) నులి పురుగులు, కొంకి పురుగులు, కొరడా పురుగులు, బద్దె పురుగులు, ఏలిక పాములు, దారపు పురుగులు.. ఇలా పొట్టలో చేరి అనేక రోగాలకు కారణమవుతుంటాయి. వీటి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ప్రతి ఏడాది రెండుసార్లు జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సోమవారం ఆగస్టు 11న మాత్రలు వేస్తారు. వైద్యాధికారి మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మాప్ ఆప్ కార్యక్రమంలో 1నుండి 2సంవత్సరముల పిల్లలకు సగం మాత్ర,2 నుండి 3సంవత్సరముల పిల్లలకు పూర్తి మాత్ర చెంచలో పొడిచేసి నీళ్లలో కలిపి అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ టీచర్ త్రాగించవలెను.3 నుండి 19 సంవత్సరముల పిల్లలకు మాత్ర నమిలి చప్పరించిన తరువాత నీరు త్రాగవలెను. ఏ ఈ ఎఫ్ ఐ,మాత్ర మింగిన తర్వాత ఏ రకమైన దుష్పరిమాణాలు వచ్చినచో వెంటనే సంబంధిత ఆరోగ్య సిబ్బందికి మరియు వైద్యాధికారికి తెలియజేసి 108, ఆర్బిఎస్ కే , ఎం హెచ్టి వాహనం ద్వారా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలి. ఆల్బెండజోల్ మాత్ర ఆహారము తీసుకున్న తరువాతనే ఇవ్వవలెను. మాత్ర ఇంటిదగ్గర వేసుకునుటకు ఇవ్వకూడదు ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఇవ్వకూడదు.పాఠశాలలు, కాలేజీలలో పిల్లలకు సంబంధిత ఉపాధ్యాయని ,ఉపాధ్యాయులు మాత్రలు విద్యార్థులకు దగ్గరుండి మిగించవలెను,అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అంగన్వాడి టీచర్ మాత్రలు చిన్నపిల్లలకు తగువిధంగా మాత్రలు మింగించవలెను. అని వైద్యాధికారి పలు సూచనలు సూచించారు.




## మొక్కజొన్న పంటలో కలుపు సమస్యకు ఇక చెక్

**గోద్రెజ్ వారి ఆగ్రోవేట్ అషిటాక ఆవిష్కరణ**

**నివారణ పై రైతులకు అవగాహన**

**భారీగా పాల్గొన్న రైతులు**

సదాశివనగర్ ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్రంలో మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్న రైతులకు గడ్డి జాతులను నాశనం చేసే కొత్త రకం గోద్రెజ్ వారి అషిటాక మందులను ఆదివారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని మర్కల్ అశోక్ గార్డెన్లో జపాన్ దేశ కంపెనీ ప్రతినిధులు ఐ ఎస్ కే కంపెనీ మీకియా హెూరి, నీ మోటో శింఫీ, హిరోటోషి కురుసుటని, గోద్రెజ్ సీఈఓ ఎస్కే రాజవెలు ఆవిష్కరించారు. మొక్కజొన్న పంటలో కలుపు మొక్కల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోద్రెజ్ అగ్రోటెక్ ఆధ్వర్యంలో జపాన్ టెక్నాలజీ తో రూపొందించిన కొత్త కలుపు నివారణ మందు అషిటాక రైతుల ముందుకు వచ్చింది. ఉత్తర తెలంగాణలో రైతులకు మరింత లాభదాయక పంట దిగుబడి కోసం ఈ మందు వాడితే కలుపును పూర్తిగా నాశనం చేసి భూసారాన్ని కాపాడుతూ పంటకు హాని లేకుండా పండిస్తుంది. మొక్కజొన్న పంట వేసిన 10 నుండి 15 రోజులలో కలుపు మొక్క రెండు, నాలుగు ఆకుల దశలో మొక్కజొన్న పంటలో అషిటాక మందును పిచికారి చేస్తే కలుపు మొక్కలు నశించి మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. మొక్కజొన్నలో ఉండే గరక, వయ్యారిభామ, ముండ్ల గడ్డి, అలం వంటి గడ్డిని పూర్తిగా నిర్మూలిస్తుందని తెలిపారు. మంచి దిగుబడి సాధించడానికి ఈ మందును వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సీఈవో ఎన్.కే రాజవేలు జపాన్ ఐఎస్కే కంపెనీ ప్రతినిధులు మికియా హెూరీ, నిమోటో షింపి, హిరోటోషి కురిసుటని, అజిత్ ప్రేమ్ నాథ్, రాజుల్ ఇడోలియా,గోద్రెజ్ నరసింహారెడ్డి, శిరీష, గణేష్ ,సత్యనారాయణ, డీలర్లు పార్సి శ్రీనివాస్, చందు, కృష్ణ, భాగ్యలక్ష్మి శ్రీనివాస్ గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా తీజ్ పండుగ

గాంధారి ఆగష్టు 10(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని వివిధ లాభనా తాండాలు తీజ్ పండుగతో కొత్త శోభను సంతరించుకున్నాయి. యువతులు, మహిళలు కొత్త పట్టుచీరలు, ఆభరణాలతో మెరిసిపోతూ పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకకు వచ్చిన అతిథులకు లాభనా సమాజ్ నాయకులు ఘన స్వాగతం పలికారు. తీజ్ పండుగ తమ సంప్రదాయంలో ఒక కీలక భాగమని, మహిళలు ఈ పండుగను ఎంతో గౌరవిస్తారని వారు తెలిపారు.గ్రామస్తులందరూ కలిసి మట్టి, పుల్లలతో తీజ్ విగ్రహాన్ని రూపొందించి, పసుపు, పూలతో అలంకరించారు. ఈ విగ్రహాన్ని తాండ నాయకుడి ఇంటి ముందు ఉంచి, మహిళలు, పురుషులు కలిసి తీజ్ పాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు.ఈ ఉత్సవాల్లో మరో ప్రత్యేక ఆకర్షణ తొమ్మిది రోజుల పాటు బుట్టలలో పెంచిన గోధుమ మొలకలను చివరి రోజున పూజించడం.పండుగ సందర్భంగా నెయ్యి రోటీ, సిరా నైవేద్యంగా సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కన్యలు తమ స్వచ్ఛతకు ప్రతీకగా ఒక రోజు ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సంవత్సరం కొత్తగా పెళ్లయిన మహిళలు కూడా తమ పుట్టింటికి వచ్చి ఈ వేడుకల్లో భాగమయ్యారు. బంధుమిత్రులతో కలిసి లాభనా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలు ముగిశాయి. మరుసటి రోజు ఉదయం తీజ్ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడంతో పండుగ వేడుకలు ముగిశాయి.



## దొంగతనం బైక్ రికవరీ

### కానిస్టేబుల్ లకు ఎస్ఐ అభినందనలు





సదాశివనగర్ ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు నివారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టు వద్ద, సదాశివనగర్ కానిస్టేబుల్స్ అజార్, శ్రీకాంత్ మరియు తాడ్వాయి కానిస్టేబుల్ ఇర్ఫాన్ విధుల్లో ఉండగా, శనివారం రాత్రి సుమారు 3:30 నుండి 4:00 గంటల మధ్యలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వ్యక్తిని ఆపి, వెహికిల్ చెకింగ్ నిర్వహించారు. చెకింగ్ లో భాగంగా అతనిని పోలీస్ స్టేషన్ కి తీసుకువెళ్లి విచారణ జరిపగా, అతడు కామారెడ్డి పట్టణం నుండి ఒక బైక్ దొంగిలించి వెళ్తున్నాడని తెలిసింది. వెంటనే ఆ బైక్‌ను రికవరీ చేసి యజమానులకు సమాచారం అందించారు. కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదై ఉండటంతో, సంబంధిత పోలీసులకు సమాచారం ఇచ్చి, దొంగను వారికి అప్పగించారు.దొంగతనాల నివారణ కోసం రాత్రంతా జాగ్రత్తగా నాకాబంది, వెహికిల్ చెకింగ్ మరియు పెట్రోలింగ్ నిర్వహించిన సదాశివనగర్ పోలీస్ సిబ్బందిని, ముఖ్యంగా అజార్, శ్రీకాంత్ మరియు ఇర్ఫాన్‌లను, ఎస్ఐ పుష్పరాజ్ అభినందించారు. వారి చురుకైన విధుల నిర్వహణ వల్ల ఒక దొంగతనం కేసు బయటపడడమే కాకుండా, దొంగకు శిక్ష పడేలా చర్యలు తీసుకోగలిగామని ఎస్ఐ తెలిపారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

### వ్యవసాయ అధికారి రాజా లింగం



గాంధారి ఆగష్టు 10(ప్రజాజ్యోతి) గాంధారి మండల పరిధిలోని కొత్త పట్టాదారు రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజా లింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 5 వరకు పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. రైతులు తమ దరఖాస్తు ఫారం తో పాటు రైతు పట్టా పాసు బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లను జతపరిచి రైతు వేదికలో అందజేయాలని సూచించారు. ఈనెల 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## తాళ సప్త భజన ప్రారంభం



సిరికొండ ఆగస్టు 10( ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలో గల శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో 89వ తాళ సప్త భజన ప్రారంభించారు. తాళ సప్త భజన ఎందుకు నిర్వహిస్తారు అంటే ఈ సమయంలో పంట పొలాల కు చీడపురుగులు ఆశించకుండా పంటలు సమృద్ధిగా రావాలని ఏడు రోజులు భక్తిశ్రద్ధలతో తాళ సప్త భజన చేస్తారని ఆలయ అర్చకుడు శ్రీకాంత్ శర్మ తెలిపారు ఈ కార్యక్రమంలో తాల సప్త భజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

సిరికొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) మండల కేంద్రానికి శివారులోని దాస్ ఫంక్షన్ ఆల్ సమీపంలో ఖాళీ స్థలంలో ఆరుగురు పేకాటాడుతున్నారన్న సమాచారంతో ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని వారి వద్ద నుండి 52 పేక ముక్కలు 4200 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి పి.జె. సుధాకర్...!



రామారెడ్డి ఆగస్టు 10(ప్రజా జ్యోతి)

ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యారంగంలో అత్యధిక డిగ్రీలుసాధిచి సరికొత్త చరిత్రని సృష్టించిన పట్నాల జాన్ ( పి.జె ) సుధాకర్ ఈ నెల 6 నాడు అనారోగ్యంతో 68 ఏళ్ల వయసులో మరణించడం కడు విషాదకరం. ఆయన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సి.బి.ఐ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి), ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, పబ్లికేషన్స్ డివిజన్ మరియు రక్షణ మంత్రిత్వ శాఖ వంటి అనేక సంస్థలలో నిరుపమాన సేవలు అందించారు. ఆయన అనేక భారతీయ విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన చదువుపై ఉన్న మక్కువతో 120 డిగ్రీలను సాధించి సరికొత్త చరిత్రని సృష్టించడం అనన్యసామాన్యం.పి.జె. సుధాకర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలో గల పెదగాడి గ్రామంలోని నిరుపేద దళిత వ్యవసాయ కూలీలైన మోషేసు, కాంతమ్మ అనే దంపతులకు 1957 డిసెంబర్ 1 నాడు జన్మించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన అనునిత్యం అనేక కష్టాలని అధిగమించారు. పి.జె. సుధాకర్ ఉన్నత పాఠశాల తర్వాత తీవ్ర పేదరికం కారణంగా తన చదువుకి మధ్యలోనే మంగళం పలికారు. ఆ క్రమంలోనే ఆయన తన బతుకు సమరాన్ని సాగించే నిమిత్తం విశాఖపట్నం జిల్లాలోని రేడగడి అనే మారుమూల గ్రామంలో గల ఒక హెూటల్‌లో వెయిటర్ గాను, పొలాల్లో పశువుల కాపరి గాను మరియు వ్యవసాయ కూలీ గాను పని చేశారు. 20 సంవత్సరాల వయస్సులో ఆయన సి.బి.ఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. అప్పటి నుండి ఆయన కరస్పాండెన్స్ కోర్సులు మరియు ఓపెన్ విశ్వవిద్యాలయాల ద్వారా సంవత్సరానికి పది డిగ్రీలు పొందాడు. 1980 లో ఆయన న్యాయశాస్త్రంలో మొదటి డిగ్రీని పొందాడు. మొదటగా సి.బి.ఐ లో చిరు ఉద్యోగంలో చేరిన డాక్టర్ పి.జె. సుధాకర్ 1987 లో దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐ.ఐ.ఎస్) కోసం ఎంపికయ్యారు.డాక్టర్ పి.జె. సుధాకర్ 2009 లో రాజా రామ్ మోహన్ రాయ్ మిషన్ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఆయన 2010 లో

హైదరాబాద్‌లోని చైతన్య ఆర్ట్ థియేటర్స్ నుండి లైఫ్ టర్మ్ అచీవ్‌మెంట్ అవార్డును స్వీకరించారు. రావూరి భరద్వాజ గారికి జ్ఞానపీఠ్ పురస్కారం రావడానికి డాక్టర్ పి.జె. సుధాకర్ అనేక విధాలుగా కృషి చేసి విజయం సాధించారు. భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసే నిమిత్తం ఆయన 2012 జూలై 29 నాడు నామినేషన్ పత్రాలను సమర్పించి అత్యధిక విద్యార్థతా పత్రాలు ఉన్న వ్యక్తిగా ఆయన కొనియాడబడ్డారు.డాక్టర్ పి.జె. సుధాకర్ ఒకపక్క ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు సాధించి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క సమాంతరంగా 120 డిగ్రీలను సాధించడం తద్వారా విద్యావ్యవస్థలో నవచరిత్రని సృష్టించారు అని సగర్వంగా చెప్పవచ్చు. ప్రజా సంబంధాలు, సామాజిక సేవ, నేర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చట్టం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, అంతర్జాతీయ సంబంధాలు, మానవ హక్కుల చట్టం మరియు వైద్య చట్టాలు వంటి అంశాలతో పాటు అనేక ఇతర రంగాలలో 120 డిగ్రీలను సాధించి ప్రపంచంలోనే సరికొత్త చరిత్రని సృష్టించారు. ఒక్క ఇంజనీరింగ్ మినహా దాదాపు మిగిలిన అన్ని విద్యా రంగాలలోను ఆయన డిగ్రీలు సాధించడం గమనార్హం. ఆయన 2014 ఆగస్టు 31 నాడు బెంగళూరులోని నేషనల్ స్కూల్ ఆఫ్ లా నుండి 104 వ డిగ్రీ స్నాతకోత్సవ వేళ సాక్ష్యాత్తు నాటి భారత ప్రధాన న్యాయమూర్తి నుండి పొందడం ఆయన జీవితంలో మరచిపోలేని ఘట్టంగా చెప్పవచ్చు. అనేకంగా రికార్డులు సాధించిన ఆయన అవివాహితుడుగానే ఉండిపోయారు.గొప్ప సామాజిక సంస్కర్తలు అయిన రాజా రామ్మోహన్ రాయ్ మరియు మదర్ థెరిసాలచే ప్రేరణ పొందిన డాక్టర్ పి.జె. సుధాకర్ సామాజిక దురాచారాల నిర్మూలన కోసం కృషిచేశారు. పిల్లలు, మహిళలు, సమాజంలోని బలహీన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల సంక్షేమం కోసం ఆయన నిరవధికంగా కృషిచేశారు. గ్రామీణ అక్షరాస్యత కోసం తీవ్రంగా కృషి చేశారు. యువత భవిత కోసం ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. ఆ రకంగా ఆయన సమాజంలోని వివిధ వర్గాల నుండి లక్షలాది మంది యువతను సామాజిక మార్పు కోసం కృషి చేశారు.వంద మంది మనస్తత్వవేత్తల బృందంగా కార్యకలాపాలు నిర్వహించే జాతీయ మానసిక ఆరోగ్య ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షుడు గాను డాక్టర్ పి.జె. సుధాకర్ కృషిచేసి సమాజంలో నైతిక విలువలు మరియు నైతిక ప్రమాణాలను ప్రోత్సహించారు. ఆయా సామాజిక సమస్యలపై వర్క్‌షాప్‌లను ఆయన నిర్వహించారు. మానవ హక్కులను పరిరక్షిస్తూనే గొంతులేని వారి గొంతుకగా తన చివరి క్షణం వరకు ఆయన కృషి చేశారు. బాల కార్మికుడి నుండి ఒదిగి ఎదిగి ఉన్నత ఉద్యోగాలతో పాటు అత్యధిక డిగ్రీలను సాధించి గిన్నిస్ రికార్డుని సాధించి అనేక రంగాలలో తనదైన ముద్ర వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన డాక్టర్ పి.జె. సుధాకర్ జీవితం భావితరాలకు తప్పకుండా ఆదర్శం కాగలదు అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**

